సాక్షి
రాజన్న సిరిసిల్ల
ఆదివారం । 16 । జూలై । 2023

సండే స్పెషల్

అపెరల్ పార్క్‌లో రెడీమేడ్ వస్త్రాలను కుడుతున్న మహిళలు





అపెరల్ పార్క్‌లోని గ్రీన్ నీడిల్ యూనిట్ ప్రవేశద్వారం

మేడిన్ సిరిసిల్ల

• రెడీమేడ్ వస్త్రాలకు కేరాఫ్ • సిరిసిల్ల నుంచి అమెరికాకు ఎగుమతులు • అపెరల్ పార్క్‌లో వస్త్రాల తయారీ • మహిళలకు మెరుగైన ఉపాధి

సిరిసిల్ల: చేస్తే బీడీలు.. లేదంటే ఖాళీగా కూర్చోవడం.. ఇది ఒకప్పటి సిరిసిల్ల ప్రాంతంలోని మహిళల పరిస్థితి. రాత్రిపగలు బీడీలు చేస్తే నెలకు రూ.3వేలు రాని రోజుల నుంచి నెలకు రూ.10 వేల వరకు సంపాదిస్తున్నారు. సిరిసిల్లలో అపెరల్‌పార్క్ ఏర్పాటుతో మహిళల జీవితాల్లో అనేక మార్పులు వచ్చాయి. రెడీమేడ్ వస్త్రాల తయారీ యూనిట్‌లో పనిచేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. సిరిసిల్ల అపెరల్ పార్క్‌లో దాదాపు 500 మంది వరకు మహిళలు ఉపాధి పొందుతున్నారు. అరకొర ఆదాయంతో గడ్డు రోజులు గడిపిన వీరు.. నేడు మెరుగైన వేతనాలతో ఆనందంగా జీవిస్తున్నారు.



ఈమె సిరిసిల్ల పట్టణంలోని గణేశ్‌నగర్‌కు చెందిన అక్షయ. పదో తరగతి వరకు చదువుకుంది. భర్త భాస్కర్ వార్పర్‌గా వస్త్రపరిశ్రమలో పనిచేస్తారు. అక్షయ బీడీలు చేస్తూ తీరిక వేళల్లో మిషన్ కుడుతూ నెలకు రూ.4వేల వరకు సంపాదించేది. సిరిసిల్ల శివారులోని అపెరల్ పార్క్‌లో రెడీమేడ్ వస్త్రాల తయారీ యూనిట్ ప్రారంభం కావడంతో అక్కడ ట్రైనర్‌గా జాయిన్ అయింది. 15 రోజుల పాటు బెంగళూర్‌లో శిక్షణనిచ్చారు. ఇప్పుడు సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ నెలకు రూ.10,300 సంపాదిస్తుంది.



ఈమె సిరిసిల్ల పట్టణంలోని బీవై నగర్‌కు చెందిన బింగి కావ్య. పదో తరగతి వరకు చదివింది. భర్త విష్ణు పవర్‌లూమ్ కార్మికుడు. వీరికి ఇద్దరు అమ్మాయిలు. కావ్య గతంలో బీడీలు చేయగా నెలకు రూ.3వేలు వచ్చేవి. ఏడాదిన్నరగా అపెరల్ పార్క్‌లో రెడీమేడ్ వస్త్రాలను కుడుతూ నెలకు రూ.7,500 సంపాదిస్తుంది.



మిషన్ కుడుతున్న ఈమె బదుగు ప్రణయ. సిరిసిల్ల శివారులోని పెద్దూరుకు చెందిన ఈమె కరీంనగర్ ఉమెన్స్ కాలేజీలో బీఎస్సీ చదివింది. ఇంటి వద్ద ఖాళీగా ఉంటుండగా అపెరల్ పార్క్‌లో రెడీమేడ్ వస్త్రాల తయారీ యూనిట్ పడింది. అక్కడ జూకీ మిషన్‌పై కుట్టు నేర్చుకుని చేరింది. నెలకు రూ.7వేల వరకు వస్తున్నాయి. ఆమె భర్త నాగరాజు కూడా ఇక్కడే పనిచేస్తారు. ఆయనకు రూ.15వేలు వస్తాయి.



వస్త్రాల కటింగ్



రెడీమేడ్ వస్త్రాల నాణ్యతను పరిశీలిస్తున్న మహిళలు



రెడీమేడ్ వస్త్రాలను ప్యాకింగ్ చేస్తున్న మహిళలు

సిరిసిల్ల టు అమెరికా

పెద్దూరు వద్ద 60 ఎకరాల్లో ఏర్పాటు చేసిన అపెరల్ పార్క్‌లో గతేడాది గోకుల్‌దాస్ ఇమేజెస్ గార్మెంట్ సంస్థ తొలి యూనిట్‌ను ప్రారంభించింది. గ్రీన్‌నీడిల్ పేరుతో రెడీమేడ్ వస్త్రాలను తయారీ చేస్తుంది. ప్రస్తుతం 400 మంది మహిళలు ఉపాధి పొందుతుండగా.. మరో 60 మంది అనుబంధంగా పనిచేస్తున్నారు. ఇంకో వెయ్యి మందికి పని కల్పించే లక్ష్యంతో యూనిట్‌ను విస్తరిస్తున్నారు. ఇక్కడ నిత్యం 5 వేల నుంచి 10 వేల వరకు లోదుస్తులు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ లోదుస్తులు వివిధ కంపెనీల పేర్లతో ముంబైకి, అక్కడి నుంచి అమెరికాకు ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడ తయారైన వస్త్రాలు వాల్‌మార్ట్, అమెజాన్ వంటి సంస్థల ద్వారా ప్రపంచస్థాయికి ఎగుమతి కావడం విశేషం. రాష్ట్ర మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు ప్రత్యేక చొరవతో అపెరల్‌పార్క్ కార్యరూపం దాల్చింది. ఇంకా మరిన్ని యూనిట్ల నిర్మాణాలు సాగుతున్నాయి. అవి పూర్తయితే జిల్లాలో మహిళల ఉపాధికి కేరాఫ్‌గా అపెరల్ పార్క్ మారనుంది.

ఉచితంగా బస్సు సౌకర్యం

సిరిసిల్ల, వేములవాడ, జిల్లెల్ల, ఎల్లారెడ్డిపేట మార్గాల్లో ఐదు బస్సులను గ్రీన్‌నీడిల్ సంస్థ ఏర్పాటు చేసింది. ఆ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేస్తూ పనిచేస్తున్నారు. యూనిట్‌లోనే క్యాంటిన్ ఏర్పాటు చేశారు. ఉచితంగానే భోజన వసతి కల్పించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు.. రెండు షిఫ్ట్‌ల్లో రెడీమేడ్ వస్త్రాల తయారీ జరుగుతోంది. చిన్నపిల్లలు ఆడుకోవడానికి కేర్‌సెంటర్, వాష్‌రూమ్స్, రెస్ట్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. మహిళా వాచ్‌మెన్లు ఉన్నారు. అనుమతి లేకుండా ఒక్కరిని కూడా లోనికి ప్రవేశించనీయరు. కొత్త వారికి 15 రోజులపాటు శిక్షణనిచ్చి పని కల్పిస్తున్నారు.

యూనిట్‌ను విస్తరిస్తాం



మా దగ్గర ప్రస్తుతం 400 మంది మహిళలు పనిచేస్తున్నారు. ఒక్కొక్కరు రూ.8,300 నుంచి రూ.11వేల వరకు వేతనాలు పొందుతున్నారు. ఇంకా యూనిట్‌ను విస్తరించాలని సంస్థ భావిస్తోంది. వెయ్యి మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో సిరిసిల్ల యూనిట్‌ను విస్తరించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. ఇక్కడ మహిళలు కష్టపడి, ఇష్టంగా పనిచేస్తున్నారు. యూనిట్ బాగా నడుస్తోంది.

– మధుకుమార్, గోకుల్‌దాస్ సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్

మరిన్ని వస్తున్నాయి



అపెరల్ పార్క్‌లోకి మరిన్ని యూనిట్లు వస్తున్నాయి. ప్రస్తుతం గోకుల్‌దాస్ సంస్థ పనిచేస్తుండగా.. టెక్స్‌ఫోర్ట్ అనే మరో సంస్థ రెండు మూడు నెలల్లో వస్తుంది. ఇది పూర్తయితే రెండు వేల మంది మహిళలకు ఉపాధి లభిస్తుంది. గార్మెంట్ రంగంతో మెరుగైన బతుకుదెరువు దరి చేరుతుంది.

– వి.అశోక్‌రావు, ఆర్‌డీడీ చేనేత, జౌళిశాఖ

ధరణి అర్జీలను వారంలో పంపించండి

• కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో ధరణిలో వచ్చిన అర్జీలపై వారంలోగా నివేదిక సమర్పించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి తహసీల్దార్లను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను రైస్‌మిల్లర్లు అందించేలా చూడాలన్నారు. ఓటర్ల జాబితాలో అర్హులకు స్థానం కల్పించాలని, చనిపోయిన వారి పేర్లను తొలగించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు, లైటింగ్, తాగునీరు, ఫర్నీచర్, టాయిలెట్లు ఉండేలా చూడాలన్నారు. ఈనెల 18 నుంచి జిల్లాలో మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇస్తారని తెలిపారు. బూత్ లెవల్ అధికారులకు విధులు, బాధ్యతలపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, పవన్‌కుమార్, స్వీప్ నోడల్ అధికారి, డీఐఈవో మోహన్, అదనపు డీఆర్‌డీవో మదన్‌మోహన్, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎన్నికల విభాగం డీటీ రహమాన్, పాషా పాల్గొన్నారు.

మాటలకు.. సరఫరాకు పొంతన లేదు

• విద్యుత్ రికార్డులు పరిశీలించిన మహేందర్‌రెడ్డి



రికార్డులు పరిశీలిస్తున్న మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వ్యవసాయానికి 24 గంటల పాటు విద్యుత్ సరఫరా ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలుకావడం లేదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి విమర్శించారు. ఎల్లారెడ్డిపేటలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని రికార్డులను శనివారం పరిశీలించారు. 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతున్నప్పటికీ 17 గంటలకు మించడం లేదన్నారు. ఉచిత విద్యుత్‌ను ఫ్యాక్టరీలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటుందని ఆరోపించారు. పార్టీ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, కార్యదర్శి లింగంగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు కొత్తపల్లి దేవయ్య, గంట బుచ్చాగౌడ్, సూడిద రాజేందర్, రాజునాయక్, రాంరెడ్డి, కోనేటి పోచయ్య, చెన్నిబాబు, ఎండీ హిమాం పాల్గొన్నారు.

మొర్రాపూర్‌తండాకు బస్సు నడుపుతాం

సాక్షి ఎఫెక్టు

ముస్తాబాద్(సిరిసిల్ల): గిరిజన విద్యార్థులకు రవాణా సౌకర్యంలో ఇబ్బందులు కలగించబోమని ఆర్టీసీ అధికారులు స్పష్టం చేశారు. ముస్తాబాద్ మండలం మొర్రాపూర్‌తండాకు బస్సును ఎప్పటిలాగే కొనసాగిస్తామని ఆర్టీసీ సిరిసిల్ల డీఎం మనోహర్ తెలిపారు. 'సాక్షి'లో 'బస్సు పాసులు తీసుకోలేదని..' అనే శీర్షికన శనివారం ప్రచురితమైన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. ఈమేరకు డిపో కంట్రోలర్ రాంరెడ్డి మొర్రాపూర్‌తండాకు చేరుకొని గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులతో చర్చించారు. తెర్లుమద్ది నుంచి గ్రామం వరకు గల విద్యుత్ తీగలు అడ్డుగా ఉన్నాయని, రోడ్డుకు ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలను తొలగించాలని ప్రజాప్రతినిధులను కోరారు. విద్యార్థులకు బస్సుపాసులు లేవని దింపి వేయలేదని, కరెంట్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయనే రెండు రోజులు బస్సును నడపలేకపోయామని స్పష్టం చేశారు. విద్యార్థుల కోసమే ఉదయం, సాయంత్రం బస్సు నడపుతున్నట్లు తెలిపారు. సర్పంచ్ దేవేందర్ నాయక్, ఎంపీటీసీ దుర్గవ్వ, బైతి నవీన్ తదితరులు పాల్గొన్నారు.


చట్టాలపై అవగాహన అవసరం

• సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ



సిరిసిల్లఅర్బన్: సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ పేర్కొన్నారు. స్థానిక జ్యోతి బీఈడీ కళాశాలలో న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. ప్రజలకు చట్టాలు కల్పించే రక్షణ, పాటించాల్సిన నియమాల గురించి వివరించారు. మహిళ రక్షణ చట్టాలు, యాంటీ ర్యాగింగ్ చట్టాలతోపాటు ఉచిత న్యాయ సలహాల గురించి వివరించారు. లోక్ అదాలత్ మెంబర్స్ చింతోజు భాస్కర్, రవీందర్‌రావు, పెంట శ్రీనివాస్, తిరుపతి, కల్యాణి, కుంట శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పదో ప్యాకేజీకి నీటి విడుదల



బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టు నుంచి పదో ప్యాకేజీకి 3,200 క్యూసెక్కుల నీరు వెళ్తోంది. ప్రస్తుతం మిడ్‌మానేరులో 15.14 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఏడు మండలాల్లో వర్షం

సిరిసిల్ల: జిల్లాలోని ఏడు మండలాల్లో శనివారం వర్షం కురిసింది. అత్యధికంగా వీర్నపల్లిలో 57.5 మిల్లీమీటర్లు వర్షం పడింది. రుద్రంగిలో 31.5, చందుర్తిలో 18.9, వేములవాడరూరల్‌లో 13.7, కోనరావుపేటలో 12.6, ఎల్లారెడ్డిపేటలో 17.4, గంభీరావుపేటలో 0.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. బోయినపల్లి, వేములవాడ, సిరిసిల్ల, తంగళ్లపల్లి, ముస్తాబాద్, ఇల్లంతకుంట మండలాల్లో చినుకు జాడ లేదు.

ఉచిత కరెంట్‌పై వైఎస్సార్ తొలి సంతకం

• కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



విలేకరులతో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ: రైతులకు ఉచిత కరెంట్ ఇచ్చేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రమాణస్వీకారం చేసిన వెంటనే తొలిసంతకం చేశారని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడలోని తన నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. రైతుపక్షపాతిగా, ప్రాజెక్టుల ప్రదాతగా, ఆరోగ్యరక్షకుడిగా వైఎస్సార్ పేరు గడించారన్నారు. బషీర్‌బాగ్ కాల్పుల సమయంలో తండ్రీకొడుకులు రాజేశ్వర్‌రావు, రమేశ్‌బాబు చంద్రబాబుల పక్కన ఉన్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అధికారంలో ఉంటూ రోడ్డుపై ధర్నా చేయడం సిగ్గుచేటన్నారు. భూకబ్జాదారులెవరో రెండు రోజుల్లో శ్వేతపత్రం విడుదల చేయాలని, సేవ్స్ పేరుతో వంద పడకల ఆస్పత్రికి కొనుగోలు చేసిన భూమి ఎటువెళ్లిందో చెప్పాలని డిమాండ్ చేశారు. సాగారం వెంకటస్వామి, చిలుక రమేశ్, పాత సత్యలక్ష్మి, శ్రీనివాస్‌గౌడ్, కొమురయ్య, మధు, కనికరం రాకేశ్, కృష్ణ, సాబీర్ తదితరులు ఉన్నారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

కోనరావుపేట(వేములవాడ): పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కోనరావుపేటలో సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులకు మద్దతు తెలిపి మాట్లాడారు. కార్మికులకు రూ.19,500 వేతనం ఉండాలని ప్రభుత్వమే చెబుతూ.. అదే గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు రూ.8,500 మాత్రమే ఇస్తున్నారన్నారు. కార్మికులు మృతిచెందిదే వారి కుటుంబాలకు భద్రత కల్పించాలని, పరిహారం అందించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు చేపూరి గంగాధర్, తాళ్లపెల్లి ప్రభాకర్, నిత్యానందం, నాగండ్ల భూమేశ్, శోభన్, మాజీ జెడ్పీటీసీ గొట్టె రుక్మిణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగును నిర్మూలిద్దాం

• అదనపు కలెక్టర్ సత్యప్రసాద్



సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు

సిరిసిల్ల: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో నులి పురుగును నివారించాలని అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ కోరారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 1–19 ఏళ్ల మధ్య వయస్సు పిల్లలకు నులిపురుగు నివారణ మాత్రలను అందించాలని సూచించారు. జిల్లాలో ఈ వయస్సు పిల్లలు 1,43,431 మంది ఉండగా.. అన్ని అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలోని పిల్లలకు మాత్రలు వేయాలన్నారు. జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు మాట్లాడుతూ పిల్లల్లో రక్తహీనత, పోషకాహారలోపం, ఆకలి మందగించడం, కడుపునొప్పి, వికారం, వాంతులు వంటి లక్షణాలున్న వారికి ఆల్బెండజోల్ మాత్రలను వేయాలన్నారు. ఎస్‌ఎంవో డాక్టర్ అతుల్ పి.నగీమ్ మాట్లాడుతూ ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుష్ 5.0 కార్యక్రమాన్ని మొదటిరౌండ్ ఆగస్టు 7 నుంచి 12 వరకు, రెండో రౌండ్ సెప్టెంబరు 11 నుంచి 16 వరకు, మూడో రౌండ్ అక్టోబరు 9 నుంచి 14 వరకు నిర్వహించాలన్నారు. ఎలాంటి వ్యాక్సిన్ తీసుకోని వారిని గుర్తించి 100 శాతం వ్యాక్సినేషన్ లక్ష్యంగా ముందుకుసాగాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీరాములు, డాక్టర్ నయీం, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు సమ్మయ్య, అన్వేశ్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ప్రతి నెల వేతనాలు అందేలా చూడండి



చందుర్తి(వేములవాడ): ప్రతి నెల వేతనాలు అందేలా చూడాలని కోరుతూ వేములవాడ నియోజకవర్గంలోని ధరణి ఆపరేటర్లు ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబుకు శనివారం వినతిపత్రం అందించారు. తమకు ఇచ్చే కొద్దిపాటి వేతనం కూడా నెలల తరబడి రావడం లేదన్నారు. గత ఆరు నెలలుగా వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చందుర్తి, రుద్రంగి, వేములవాడ అర్బన్, వేములవాడరూరల్ ధరణి ఆపరేటర్లు దిలీప్‌కుమార్, సాయి, శ్రీనివాస్, శ్రీహరి ఉన్నారు.

'తెలుగు-వెలుగు' జిల్లా అధ్యక్షుడిగా యాదగిరిగౌడ్



యాదగిరిగౌడ్

సిరిసిల్ల: తెలుగు-వెలుగు సాహితీ వేదిక, స్వచ్ఛంద సేవా సంస్థ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా అక్కపల్లి యాదగిరిగౌడ్‌ను నియమిస్తూ సంస్థ వ్యవస్థాపకుడు పోలోజు రాజ్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సంస్థ సేవా కార్యక్రమాలను, సాహితీ కార్యక్రమాలను నిర్వహించేందుకు యాదగిరిగౌడ్‌ను నియమించినట్లు కన్వీనర్ రంగొట్టి రమేశ్ పేర్కొన్నారు.

భక్తులకు ర్యాంప్ ఏర్పాటు



సాక్షి ఎఫెక్టు

వేములవాడ: 'శివ..శివా' అని 'సాక్షి'లో భక్తుల కష్టాలపై ప్రచురితమైన కథనానికి ఆలయ అధికారులు స్పందించారు. గుడి చెరువు ఖాళీ స్థలం నుంచి కిందికి వెళ్లేందుకు గతంలో ఉన్న ర్యాంప్‌ను తొలగించడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని 'సాక్షి' ప్రచురించడంతో ఆలయ అధికారులు స్పందించి ర్యాంప్‌ను ఏర్పాటు చేశారు. దీంతో భక్తులు సులువుగా కిందికి వెళ్తున్నారు.

60 మంది బీసీలు చట్టసభకు వెళ్లాలి



సిరిసిల్ల: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 60 మంది బీసీలు చట్టసభలకు వెళ్లాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరిగే బీసీ రాజకీయ ప్లీనరీకి సిరిసిల్ల నుంచి వెళ్తున్న బీసీ శ్రేణుల వాహనాన్ని శనివారం జెండా ఊపి ప్రారంభించారు. హన్మాండ్లు మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ సాధికారత, భవిష్యత్ కార్యాచరణకు బీసీ మేధావులు, సామాజిక కార్యకర్తలు బీసీ రాజకీయ ప్లీనరీని నిర్వహిస్తున్నారని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓటుబ్యాంకుగా వాడుకుని వదిలేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా బీసీలు ఐక్యంగా ఉండి బీసీ నేతలను చట్టసభకు పంపించే దిశగా ఆలోచించాలని కోరారు. నాయకులు కంచర్ల రవిగౌడ్, కందుకూరి రామాగౌడ్, ప్రకాశ్, తిరుపతి, సుజిత్, ప్రశాంత్, శ్రీధర్ పాల్గొన్నారు.

రాజన్నకు ప్రత్యేక పూజలు



వేములవాడ: మాసశివరాత్రిని పురస్కరించుకొని రాజన్న ఆలయంలో శనివారం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. భక్తులు రాజన్నను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

క్లుప్తంగా

విద్యాబుద్ధులు నేర్పిన గురువుకు చేయూత


ఆర్థిక సాయం అందిస్తున్న శిష్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటకు చెందిన ఆకుల వేణుకు పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయం అందించారు. గతంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్‌స్కూల్‌లో పనిచేసిన వేణు తల్లి పక్షవాతం సోకి ఏడాదిగా మంచం పట్టింది. ఆమెకు సేవ చేసుకునేందుకు వేణు హైదరాబాద్‌లోని ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం వదులకొని స్వగ్రామానికి వచ్చాడు. చేతిలో డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న తమ గురువు వేణుకు పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. బింగి బాబుయాదవ్, దినేశ్‌గౌడ్, పెంటం రాజశేఖర్, జీడి శ్రావణ్‌కుమార్, చిన్నబాలు రాహుల్, బసవపురం కృష్ణ, రాగుల సాయికిరణ్, సనుగుల సతీశ్, తుమ్మనపల్లి రాజేశ్, చిట్టి రాజ్‌కుమార్, శ్రీరామోజి ప్రవీణ్ అందరూ కలిసి రూ.10వేల ఆర్థిక సాయం చేశారు.

ముడుపు విప్పిన రైతులు



ఎల్లారెడ్డిపేట: వరుణుడు కరుణించి, వర్షాలు పడాలని కోరుతూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన రైతులు 15 రోజుల క్రితం స్థానిక పురాతన శివాలయంలో ముడుపు కట్టారు. ఆలయంలో నీటిని నింపి, స్వామివారికి జలాభిషేకం చేశారు. ఏటా ఇలా చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో వర్షాలు పడటంతో శనివారం రైతులు ఆలయంలో నింపిన నీటిని తొలగించి, ముడుపు విప్పి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పశుసంపద, పంటలు బాగుండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్ నంది కిషన్, అన్నదాతలు పారిపల్లి రాంరెడ్డి, సురేందర్‌రెడ్డి, పద్మారెడ్డి, సత్యంరెడ్డి, వేద పండితులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


నాగరాజు (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని నిజామాబాద్‌కు చెందిన పాటి నాగరాజు(25) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. నిజామాబాద్‌కు చెందిన పాటి మొండయ్య–మల్లవ్వ కుమారుడు నాగరాజు వేములవాడలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు. తండ్రి మొండయ్య రెండేళ్ల క్రితం మృతిచెందగా తల్లితో కలిసి ఉంటున్నాడు. ఈనెల 12న డ్యూటీకి వెళ్తున్నానని చెప్పిన నాగరాజు తిరిగి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో తల్లి మల్లవ్వ కోనరావుపేటలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శనివారం నిజామాబాద్ శివారులోని పందిగుట్ట ప్రాంతంలో నాగరాజు శవం కనిపించింది. సంఘటన స్థలంలో పురుగుల మందు డబ్బా కనిపించడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతుని తల్లి మల్లవ్వ ఫిర్యాదుతో ఎస్సై రమాకాంత్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వేములవాడరూరల్: వేములవాడ మూలవాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం ఫాజుల్‌నగర్ ప్రాంతంలో పట్టుకున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వెనక్కిపట్టిన వాన.. నీరందేనా?


ముస్తాబాద్‌లో గుర్రపు డెక్క, మురుగు నీటితో కెనాల్


బోరు కింద సిద్ధమవుతున్న నారుమడి

- ఎగువ మానేరు ప్రాజెక్టుపైనే రైతుల ఆశలు
- రిపేరులో షట్టర్లు, అక్విడేటర్ల లీకేజీ
- కెనాల్‌లో పేరుకున్న గుర్రపు డెక్క, తుంగ
- నీరు విడుదల చేసినా చివరి పంటలకు చేరుతుందో లేదోనని ఆందోళన

ముస్తాబాద్(సిరిసిల్ల): వానాకాలం మొదలైంది. చినుకు పడని రోజు లేదు. అయినా అడుగంటిన భూగర్భజలాలు.. భారీ వానల కోసం ఆశగా ఆకాశం వైపు చూస్తున్న రైతులు.. వెనక్కిపట్టిన వానల కారణంగా రాజన్నసిరిసిల్ల జిల్లా రైతాంగం పంటల సాగు కోసం ఎగువ మానేరు ప్రాజెక్టుపైనే ఆశలు పెట్టుకుంది. వర్షాభావంతో నారుమడులు ఆలస్యమవుతుండటంతో.. కొంతమంది బోరుబావులపై ఆధారపడి సాగుకు సమాయత్తం అవుతున్నారు.

మల్లన్న సాగర్ నుంచి మానేరులోకి నీరు

ఎగువ మానేరు ప్రాజెక్టు జిల్లాకు వరప్రదాయిని. ఈ వర్షాకాలంలో ప్రాజెక్టులో 1.5 టీఎంసీల నీటి నిల్వ ఉండటంతో అన్నదాతల ఆశలు చిగురించాయి. మల్లన్న సాగర్ ప్రాజెక్టు కెనాల్ ద్వారా మానేరులోకి నీరు వస్తుండటంతో నీల్వ ఆశించిన స్థాయిలో ఉంది. ప్రస్తుతం వానలు సరిగా కురవకపోవడంతో వ్యవసాయానికి పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేస్తున్నారు. కుడి కాలువ 22 కిలోమీటర్ల మేర ఉండగా 14 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. దీనికి అదనంగా సాగులోకి వచ్చిన భూమి 5 వేల ఎకరాల్లో ఉండే అవకాశాలున్నాయని నీటిపారుదల శాఖ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు కెనాల్, సబ్ కెనాల్స్, షట్టర్లు రిపేరులో ఉన్నాయి. అక్విడేటర్లు లీకేజీ అవుతున్నాయి. వీటన్నింటినీ దాటుకొని, సాగునీరు చివరి పంటలకు చేరేనా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వేగంగా జరగని షట్టర్ల మరమ్మతు

ఎగువ మానేరు ప్రాజెక్టు కెనాల్స్, షట్టర్ల రిపేరుకు రూ.80 లక్షలు కావాలని ప్రతిపాదించారు. ఇందులో ఇప్పటికే రూ.40 లక్షల పనులు చేపట్టారు. మరో రూ.5 లక్షల వరకు టెండర్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే లోతు చెరువు, డీ–9 నుంచి డీ–23 వరకు షట్టర్లను మరమ్మతు చేసే పనిలో పడ్డారు. అయితే పనులు వేగంగా జరగకపోవడంతో సకాలంలో నీరందడం లేదన్న విమర్శలున్నాయి. డీ–18 నుంచి సబ్ కెనాల్ ద్వారా పోతుగల్‌కు వెళ్లే నీటి కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ముస్తాబాద్‌లో దాదాపు 3 కిలోమీటర్ల మేర కెనాల్‌లో గుర్రపు డెక్క దట్టంగా అలుముకుంది. పైగా ముస్తాబాద్ పట్టణ మురుగు నీరంతా ఇందులోనే చేరుతోంది. రాంరెడ్డిపల్లె, గూడెం, కొండాపూర్, గూడూరు, నామాపూర్, తెర్లుమద్ది వద్ద కెనాల్‌లో అక్కడక్కడ రిపేర్లు ఉన్నాయి. తెర్లుమద్ది, పోతుగల్, ముస్తాబాద్ చివరి భూములకు నీరందించాలని రైతులు కోరుతున్నారు. సబ్ కెనాల్స్‌లో పోతుగల్, తెర్లుమద్ది, కొండాపూర్, రాంరెడ్డిపల్లెలో 80 కిలోమీటర్ల కొంత గ్రావెల్ ఉంది. దీన్ని దాటుకొని, నీరు ముందుకెళ్లడం ఇబ్బందిగా ఉంది.

నీళ్లు రావడం లేదు



నాకు ఎకరం భూమి ఉంది. బోరు లేదు. మానేరు కెనాల్ కిందనే ఏటా సాగు చేస్తున్న. వానలు పడటం లేదు. కాలువలో గుర్రపు డెక్క, తుంగ పేరుకుపోయింది. నారు పోద్దామంటే మా పొలం వరకు నీళ్లు రావడం లేదు.
– మాచర్ల శ్రీనివాస్, రైతు, పోతుగల్

బోరు నీటితో నాటు వేసిన



నాకు ఐదెకరాలు భూమి మానేరు కెనాల్ కిందనే ఉంది. కాలువ నీరు రావడం లేదు. దీంతో బోరు నీటితోనే రెండెకరాల్లో నాటు వేసిన. కెనాల్‌లో నీరు వస్తే మరో మూడెకరాలు సాగు చేస్తా. అధికారులు పట్టించుకోవాలి.
– నీలం భూపతి, రైతు, ముస్తాబాద్

50 శాతం మరమ్మతు పూర్తి



మానేరు కెనాల్స్‌కు 50 శాతం మరమ్మతు పూర్తి చేశాం. ముస్తాబాద్ పెద్ద చెరువు ద్వారానూ నీరందిస్తున్నాం. కాలువల్లో గుర్రపు డెక్క, తుంగ తొలగించేందుకు రూ.5 లక్షలు కేటాయించాం. త్వరలో పనులు చేపట్టి, పంటలకు నీరిస్తాం.
– రవికుమార్, డీఈఈ

పైపులైన్ పగిలి.. నీటి సరఫరా నిలిచి



ఈ నెల 11న రోడ్డుపై ప్రవహించిన నీరు, భారీ గుంత కారణంగా వాహనదారుల ఇబ్బందులు

- వేములవాడలో ఓ ప్రైవేటు కంపెనీ పనితీరు
- నీరందక ప్రజల ఇబ్బందులు
- రాకపోకలకూ తిప్పలే

వేములవాడ: ఓ ప్రైవేట్ కంపెనీవారు వేములవాడ పట్టణంలోని సెస్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై ఫైబర్ కేబుల్ పనులు చేపట్టారు. వారి నిర్వాకం వల్ల అక్కడున్న మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోయింది. దీంతో నీరు పెద్దఎత్తున రోడ్డుపై ప్రవహించింది. వాహనదారులు ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ నీటి విభాగం సిబ్బంది నీటి సరఫరా నిలిపివేశారు. అయితే ప్రైవేట్ కంపెనీ చేసిన డ్యామేజ్ వల్ల స్థానికులకు నాలుగు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. వారు నానాతంటాలు పడుతున్నారు. కేబుల్ పనుల్లో భాగంగా ఒకచోట గుంత తవ్విన సదరు కంపెనీవారు దాన్ని పూడ్చినా రోడ్డును ఆక్రమించడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మరోచోట పైపులైన్‌కు మరమ్మతు చేసి, భారీ గుంతను పూడ్చని కారణంగా ట్రాఫిక్‌జామ్‌తో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ ఏఈ నర్సింహస్వామిని వివరణ కోరంగా ఓ ప్రైవేట్ సంస్థవారు పైప్‌లైన్‌ను డ్యామేజ్ చేశారన్నారు. తమ సిబ్బందితో మరమ్మతు చేయించామని, రోడ్డుకు మరమ్మతు చేయాలని ఆ కంపెనీని ఆదేశించామని పేర్కొన్నారు. నీటి సరఫరా కొనసాగిస్తామని చెప్పారు.

రూ.1.80 కోట్ల టీటీడీ నిధులు మంజూరు

- ఎమ్మెల్యే రమేశ్‌బాబు


నిధుల మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు అందిస్తున్న టీటీడీ పర్యవేక్షకుడు రామనాథం

వేములవాడ: వేములవాడ నియోజకవర్గంలోని 18 ఆలయాలకు రూ.1.80 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే రమేశ్‌బాబు తెలిపారు. ఆమేరకు టీటీడీ ఆలయ పర్యవేక్షకుడు రామనాథం శనివారం మంజూరుపత్రాన్ని అందజేసినట్లు చెప్పారు. నిధులు మంజూరు చేసిన టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, బోర్డు సభ్యుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ నిధులతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నియోజకవర్గంలోని 56 ఆలయాలకు ధూపదీప నైవేద్యాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

నిధులు మంజూరైన ఆలయాలు..

మేడిపల్లి మండలం కాచారంలోని సీతారామచంద్రస్వామి, కొండాపూర్‌లోని శివగంగ ఆలయం, మన్నెగూడెంలోని ప్రభురాయుడి ఆలయం, మోత్కురావుపేటలోని దుర్గమ్మ గుడి, రాగోజిపేటలోని దొంగమల్లన్న, పోతారంలోని లొంక రామేశ్వరాయం, కథలాపూర్‌లోని పెరుమాండ్ల ఆలయం, రుద్రంగిలోని గండి వేంకటేశ్వరస్వామి, నర్సింగాపూర్‌లోని మోహినికుంట లక్ష్మీనర్సింహస్వామి, రామన్నపేటలోని గండి వేంకటేశ్వరస్వామి, వట్టిమల్ల శివసాయి ఆలయం, సుద్దాలలోని చెన్నకేశవాలయం, ఎదురుగట్లలోని వేంకటేశ్వరస్వామి, చెక్కపల్లిలోని పెద్దమ్మ ఆలయం, చింతల్‌ఠాణాలోని హనుమాన్ ఆలయం, అనుపురంలోని రామాలయం, వేములవాడలోని శ్రీకృష్ణ దేవాలయం, వేంకటేశ్వరస్వామి ఆలయాలకు నిధులు మంజూరైనట్లు చెప్పారు.

రూ.100 కోట్ల కుంభకోణాన్ని వెలికితీయాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేశ్


మాట్లాడుతున్న మహేశ్

సిరిసిల్లఅర్బన్: వేములవాడలో జరుగుతున్న రూ.100 కోట్ల కుంభకోణాన్ని మంత్రి కేటీఆర్ వెలికితీయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేశ్ డిమాండ్ చేశారు. శనివారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేములవాడలో రూ.100 కోట్ల కుంభకోణం జరుగుతోందని స్థానిక ఎమ్మెల్యే రమేశ్‌బాబు బహిరంగంగానే మాట్లాడుతున్నారని తెలిపారు. దాన్ని వెలికితీసి, ఆ మొత్తాన్ని నిరుపేదలకు పంచాలన్నారు. జిల్లా అధికారులు భూ ఆక్రమణ కుంభకోణంపై విచారణ చేపట్టి, కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ ఆడెపు రవీందర్, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సిరస్వాల్ కైలాస్, బీజేవైఎం నాయకుడు వంగ అనిల్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఐ కరుణాకర్‌కు సేవా పతకం


సీఐ పి.కరుణాకర్

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల పోలీసు విభాగంలో పనిచేస్తున్న పులక్కం కరుణాకర్‌కు ఉత్తమ సేవా పతకం వచ్చింది. ఈ విషయాన్ని పోలీస్ అధికారులు శనివారం వెల్లడించారు. 2012 బ్యాచ్‌లో ఎస్సైగా చేరి పదోన్నతితో రామగుండం ఐటీ సెల్‌లో విధులు నిర్వహించి, బదిలీపై సిరిసిల్ల ఎస్పీ సీఐగా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో నిబద్ధతగా ఉండగా ఇప్పటి వరకు దాదాపు 200 ప్రశంసలు, నగదు పారితోషికాలు అందుకున్నారు. సేవా పతకం రావడం ఆనందంగా ఉందని, ఈ పతకం రావడంతో మరింత బాధ్యత పెరిగిందని కరుణాకర్ వెల్లడించారు. అలాగే సిరిసిల్ల ఎస్సై మహేందర్, హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, ఏఆర్ కానిస్టేబుల్ అజయ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ బొంతు రాజు, గంభీరావుపేట కానిస్టేబుల్ రాజేందర్ సేవా పతాక గ్రహీతలుగా ఉన్నారు.

అనంతపల్లివాసికి...


ఇన్‌స్పెక్టర్ మధు

బోయినపల్లి: అనంతపల్లికి చెందిన ఇన్‌స్పెక్టర్ కన్నం మధు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ పోలీస్ సేవా పతకానికి ఎంపికయ్యారు. కన్నం రాజయ్య–అమృత దంపతుల కుమారుడైన ఆయన 2012లో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగంలో చేరారు. వరంగల్ జిల్లాలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన అవార్డుకు ఎంపికవడం పట్ల గ్రామస్తులు, కుటుంబసభ్యులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా

జగిత్యాలక్రైం: బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి రూ.లక్ష జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాయికల్‌కు చెందిన కలమడుగు రాజేశం నాటుసారా విక్రయిస్తున్నాడన్న అనుమానంతో పోలీసులు గతేడాది డిసెంబర్‌లో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి 23.06.2023న నాటుసారా విక్రయిస్తూ ఎక్సైజ్ అధికారులకు పట్టుబడ్డాడు. పోలీసులు శనివారం అతన్ని జగిత్యాల రూరల్ తహసీల్దార్, రాయికల్ ఇన్‌చార్జి తహసీల్దార్ నవీన్ ఎదుట ప్రవేశపెట్టారు. ఆయన రూ.లక్ష జరిమానా విధించగా చెల్లించాడని ఎక్సైజ్ సీఐ పేర్కొన్నారు.

చెట్టును ఢీకొన్న బైక్ : యువకుడి మృతి

మల్లాపూర్(కోరుట్ల): బైక్ చెట్టును ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందగా మరో యువకుడు గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నేపాల్‌కు చెందిన విజయ్ సాద్(26), బీర్ సాద్ ఉపాధి నిమిత్తం మల్లాపూర్ మండలంలోని వీవీరావుపేట్‌లో స్థిరపడ్డారు. గ్రామంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం రాత్రి సామగ్రి కోసం బైక్‌పై మల్లాపూర్ వచ్చి, తిరిగి వెళ్తున్నారు. గొర్రెపల్లి దాటాక అతివేగంగా వాహనం నడిపి, చెట్టును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే విజయ్ సాద్ మృతిచెందాడని వైద్యులు తెలిపారు. బీర్ సాద్ చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నవీన్ పేర్కొన్నారు.

నెరవేరనున్న గిరిజనుల కల

- గుంటుపల్లి చెరువుతండాకు వంతెన మంజూరు
- భూమిపూజ చేసిన నాయకులు


భూమి పూజ చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గిరిజనుల కల నెరవేరనుంది. వంతెన లేక ఇన్నాళ్లు పడ్డ కష్టాలు దూరంకానున్నాయి. మండలంలోని గుంటుపల్లిచెరువు తండాకు బ్రిడ్జి నిర్మాణానికి రూ.కోటి నిధులను మంత్రి కేటీఆర్ మంజూరు చేశారు. ఈమేరకు శనివారం ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సర్పంచ్ మాలోతు సునీత భూమి పూజ చేశారు. మండల కేంద్రం నుంచి గుంటుపల్లిచెరువు తండాకు వెళ్లాలంటే మధ్యలో ఉన్న వాగు వర్షాకాలంలో ఉప్పొంగేది. వర్షాకాలంలో తండా ప్రజలకు ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయేవి. తండా ప్రజల కష్టాలను తీర్చేందుకు మంత్రి కేటీఆర్ రూ.కోటి నిధులు మంజూరు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్‌విండో అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు అందె సుభాష్, గుల్లపల్లి నరసింహారెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు గణేష్, నాయకులు పుణ్యానాయక్, గణేష్, జవహర్, జలపతి తదితరులు పాల్గొన్నారు.

‘మేమెవరినీ కులబహిష్కరణ చేయలేదు’

- అన్యాయంగా కేసు నమోదు చేశారు
- ఠాణాలో కొలనూర్ దళిత నాయకులు


పోలీస్‌స్టేషన్ ఎదుట మాట్లాడుతున్న నాయకులు

కోనరావుపేట: ‘మేము ఎవరినీ కుల బహిష్కరణ చేయలేదని, ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుల సంఘం నాయకులపై కేసు నమోదు చేశారని’.. కొలనూర్ దళిత సంఘం అధ్యక్షుడు సుదమల్ల రజినీకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సంఘం సభ్యులతో ఆయన పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. కొలనూర్ సంఘంలో మొత్తం 90 మంది సభ్యులున్నారని తెలిపారు. భూమికి సంబంధించిన పంచాయితీని దృష్టిలో పెట్టుకున్న సభ్యుడు బిట్ల ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎలాంటి విచారణ లేకుండానే తుమ్మల సురేశ్, దేవరాజు, సుదమల్ల చంద్రయ్య, లక్ష్మీరాజంలపై కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఎవరినీ కుల బహిష్కరణ చేయలేదని మిగతా 89 మంది సభ్యులతో వచ్చి, ఆధారాలు సమర్పించినా స్పందన కరువైందన్నారు. పోలీసులు తమను రోజూ ఠాణా చుట్టూ తిప్పుకుంటున్నారని వాపోయారు. తాము సమర్పించిన ఆధారాలను పరిశీలించి, నాయకులపై పెట్టిన కేసు కొట్టివేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ విషయమై ఎస్సై రమాకాంత్‌ను వివరణ కోరగా కులబహిష్కరణ చేయలేదని ఆధారాలు ఇవ్వాలని కోరామన్నారు. ఘటనపై విచారణ జరిపి, చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న రమేశ్

ఎల్లారెడ్డిపేట: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం పదోరోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన వారికి సంఘీభావం తెలిపారు. కార్మికులు రోడ్డుపై వంటావార్పు చేసి, నిరసన తెలిపారు. రమేశ్ మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కారమయ్యేవరకు కార్మికులకు అండగా ఉంటామన్నారు. పాలకులు వారి సేవలను గుర్తించడం లేదని, సమ్మె చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు రేసు రాజయ్య, నాయకులు జక్కుల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

‘పోడు’ సాగుదారులందరికీ పట్టాలివ్వాలి


మాట్లాడుతున్న వేణు

సిరిసిల్లఅర్బన్: జిల్లాలో పోడు భూములను సాగు చేసుకుంటున్న అందరికీ పట్టాలివ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సిరిసిల్ల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజన్నసిరిసిల్ల జిల్లాలో 15 ఏళ్లుగా పోడు భూములను సాగు చేసుకుంటూ దాదాపు 5 వేల మంది జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. కానీ అధికారుల నిర్లక్ష్యంతో వల్ల ప్రభుత్వం కేవలం 1,614 మందికే పట్టాలు ఇచ్చిందని పేర్కొన్నారు. మిగతా వారికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 22న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని, పోడు భూముల సాగుదారులు హాజరై, విజయవంతం చేయాలని కోరారు. జిల్లా నాయకులు శావనపెల్లి మల్లేశం, పంతం రవి, రమేశ్, రాముడు, అంజయ్య, సుదర్శన్, అనసూయ, మల్లేశంగౌడ్, జాన్సన్ తదితరులున్నారు.

32 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


నిందితులు, బియ్యాన్ని చూపుతున్న పోలీసులు

ముస్తాబాద్: టాస్క్‌ఫోర్స్ పోలీసులు 32 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై మారుతి తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ముస్తాబాద్ మండలంలోని నామాపూర్‌లో శనివారం తెల్లవారుజామున పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన రెండు వాహనాల్లో బియ్యం తరలిస్తూ నామాపూర్‌వాసులు కడమంచి గట్టయ్య, పర్వతం సంతోష్, దుబ్బాక మండలంలోని పెద్దచీకోడుకు చెందిన చౌడ శ్రీకాంత్, ఎల్లారెడ్డిపేటకు చెందిన కడమంచి కనకయ్య పట్టుబడ్డారు. తదుపరి చర్యల నిమిత్తం వారితోపాటు బియ్యం ఉన్న వాహనాలను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్సై తెలిపారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై ఎవరికైనా సమాచారం ఉంటే తెలియజేయాలని కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 5 తులాల బంగారం, 8 తులాల వెండి
- రూ.60వేల నగదు అపహరణ


డాగ్‌స్క్వాడ్ తనిఖీలు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ పట్టణంలో మరో చోరీ జరిగింది. తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చొరబడి బంగారం, వెండి ఆభరణాలతోపాటు నగదును ఎత్తుకెళ్లారు. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌కు చెందిన గొట్టె రవీందర్–లక్ష్మీ దంపతులు రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి నామాపూర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడ శుభకార్యంలో పాల్గొని శనివారం ఉదయం ఇంటికి చేరుకున్న రవీందర్‌కు తెరిచి ఉన్న తలుపులు కనిపించాయి. వెంటనే ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాలోని రూ.60వేలు, ఐదు తులాల బంగారం, 8 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్సై వెంకటేశ్వర్లు క్లూస్ టీంతో అక్కడికి చేరుకొని ఆధారాలు సేకరించారు. డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. రవీందర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొండగట్టు వెళ్లిన బీఆర్‌ఎస్ నాయకులు


కొండగట్టు వెళ్తున్న నాయకులు

బోయినపల్లి: రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్ శనివారం కొండగట్టు అంజన్నను దర్శించుకున్నారు. స్థానిక అటవీ ప్రాంతాన్ని గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా దత్తత తీసుకోగా మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌లతో కలిసి మొక్కలు నాటారు. ఆయన కొదురుపాకవాసి కావడంతో స్వాగతం పలికేందుకు బీఆర్‌ఎస్ బోయినపల్లి మండల నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీ సభ్యురాలు కత్తెరపాక ఉమ, వైస్‌ఎంపీపీ నాగయ్య, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, నాయకులు అనుముల భాస్కర్, నిమ్మ శ్రీనివాసరెడ్డి, గుంటి శంకర్, అనిల్, బాబు తదితరులు పాల్గొన్నారు.